MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక






ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 12 | సోమవారం 12 జనవరి 2026 | పేజీలు : 4 | వెల : 3/-




# పోలవరం అద్భుతమైన ప్రాజెక్టు

## తెలంగాణ ప్రాజెక్టులకు నేనెప్పుడూ అడ్డు చెప్పలేదు

- రాష్ట్ర ప్రజల ఆశలను నిలబెట్టాం.. వారిలో విశ్వాసాన్ని మళ్లీ కల్పించాం
- సూపర్‌సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగంగా చేయగలిగాం
- ఈ ఏడాది కూడా మరింత కష్టించి పని చేద్దాం
- అమరావతిని శ్మశానం, ఎడారి అని గతంలో హేళన చేశారు
- అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నాం
- భోగాపురం ఎయిర్‌పోర్టును త్వరలోనే జాతికి అంకితం చేస్తాం

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**


రాష్ట్ర ప్రజల ఆశలను నిలబెట్టామని.. వారిలో విశ్వాసాన్ని మళ్లీ కల్పించామని సీఎం చంద్రబాబు అన్నారు. 2025 ఏడాది మంచి ఫలితాలను ఇచ్చిందని చెప్పారు. విధ్వంసమైన వ్యవస్థల నుంచి సుపరిపాలనను గాడిలో పెట్టామన్నారు. సూపర్‌సిక్స్ ద్వారా సంక్షేమం, అభివృద్ధిని వేగంగా చేయగలిగామని.. ఈ ఏడాది కూడా మరింత కష్టించి పని చేద్దామన్నారు. సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో సీఎం సమీక్ష నిర్వహించారు. జీఎస్‌డీపీ, ఆర్టీజీఎస్, పట్టాదారు పాస్ పుస్తకాలు తదితర అంశాలపై చర్చించారు. తల్లికి వందనం ద్వారా 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,090 కోట్లు జమ చేశామని సీఎం అన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా 3.5కోట్ల మంది మహిళలు ప్రయాణాలు చేశారని.. దీనికోసం ఇప్పటి వరకు రూ.1,114 కోట్ల వ్యయం చేశామని చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద 46లక్షల మంది రైతులకు రూ.6,310 కోట్లు ఖాతాల్లో వేశామని వివరించారు. ఏడాదిన్నరలో 50వేల కోట్ల మేర పింఛన్లు అందించడంతో సంక్షేమంలో కొత్త మైలురాయిని సాధించామని సీఎం పేర్కొన్నారు. అమరావతిని శ్మశానం, ఎడారి అని గతంలో హేళన చేశారని.. కానీ ఇదో స్ఫూర్తిదాయక - మిగతా3లో

## గడ్కరీ వేగం అందరికీ తెలుసు...

- ఆయన నాయకత్వంలో ఈ రికార్డు గర్వకారణం: సీఎం చంద్రబాబు
- బెంగళూరు-విజయవాడ కారిడార్‌కు 4 గిన్నిస్ రికార్డులు
- 5 రోజుల్లో 52 కి.మీ. 6 లేన్ల రహదారి నిర్మించి అరుదైన ఘనత
- కేంద్ర మంత్రి గడ్కరీ, నిర్మాణ సంస్థకు సీఎం చంద్రబాబు అభినందనలు
- అమరావతి-బెంగళూరు రోడ్డుగా పేరు పెట్టాలని ముఖ్యమంత్రి సూచన

## దేశీ బుల్లెట్‌లో రాకెట్!





## 'లేపాక్షి'లో డిస్కౌంట్ అమ్మకాలు

- రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత..
- కళాకారుల ఉపాధి పెంపే లక్ష్యంగా డిస్కౌంట్ విక్రయాలు
- 10, 20, 30 శాతం డిస్కౌంట్లతో కళారూపాల అమ్మకాలు
- ఈ నెలాఖరు వరకూ డిస్కౌంట్లు వర్తింపు
- మొదటి విడతలో వైజాగ్, అనంతపురం, కడప షో రూమ్‌ల అభివృద్ధి



# అమరావతిలో జోరుగా రెండో విడత ల్యాండ్ పూలింగ్

- కర్లపూడిలో ప్రారంభం
- కర్లమూడి, లేమల్లె తదితర గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ ప్రారంభం
- మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రవీణ్‌లను ఘనంగా స్వాగతించిన స్థానికులు
- తమ గ్రామాలను ఎంపిక చేసినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపిన గ్రామస్థులు



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

ఏపీ రాజధాని అమరావతి రెండో దశ ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ ఊపందుకుంటోంది. ఈరోజు పల్నాడు జిల్లాలోని పెదకూరపాడు మండలం కర్లపూడి - లేమల్లె గ్రామాల్లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి మంత్రి నారాయణ ఈ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తో కలిసి నారాయణ రైతుల నుంచి అంగీకార పత్రాలు స్వీకరించారు. తమ వద్దకు వచ్చిన మంత్రి, ఎమ్మెల్యేలకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలతో స్వాగతించారు. తమ గ్రామాలను ఈ ప్రాజెక్టుకు - మిగతా3లో



# వైసీపీ విష ప్రచారం చేస్తోంది

- గోబెల్స్ కాదు... ఇక 'జగన్ బెల్స్' అని పిలవాలేమో!
- భక్తుల మనోభావాలపై జగన్మోహన్ రెడ్డి దండయాత్ర చేస్తున్నారన్న మంత్రి పార్థసారథి
- రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా వైసీపీ విష ప్రచారం చేస్తోందని ఆరోపణ
- తిరుమలలో మద్యం సీసాల కుట్రను సీసీ కెమెరాలు బట్టబయలు చేశాయని వెల్లడి
- స్వామిని నల్లరాయి అన్న భూమన ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా
- లడ్డూ నెయ్యిలో అవినీతిపై విచారణ జరుగుతోందని, త్వరలో నిజాలు బయటపడతాయని వెల్లడి




## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ

- ఈసీకి మరోసారి మమతా బెనర్జీ లేఖ
- 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు చోటు చేసుకున్నాయని ఆరోపణ
- నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్న మమతా బెనర్జీ
- ఎస్ఐఆర్ ప్రారంభమైనప్పటి నుంచి ఈసీకి ఇది ఐదో లేఖ



## మిత్రుల మధ్య విభేదాలు సహజమే..

- అందుకే ట్రంప్-మోదీ మధ్య దూరం!: అమెరికా రాయబారి
- ట్రంప్, మోదీ మధ్య స్నేహబంధం నిజమైందేనన్న అమెరికా రాయబారి
- ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద దేశమన్న సెర్గియో గోర్
- రెండు దేశాల సత్సంబంధాలకు వాణిజ్యం చాలా కీలకమని వ్యాఖ్య



## అత్యాధునిక టెక్నాలజీతో అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు

- ఎన్‌హెచ్ఏఐపై నితిన్ గడ్కరీ ప్రశంసలు
- బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ నిర్మాణంలో 4 గిన్నిస్ రికార్డులు
- నూతన సాంకేతికతతో అద్భుతంగా నిర్మించారన్న గడ్కరీ
- ఈ రికార్డులు దేశానికి, ఏపీకి గర్వకారణమన్న చంద్రబాబు

# ‘లేపాక్షి’లో డిస్కౌంట్ అమ్మకాలు

**అంకుశం ప్రతినిధి అమరావతి జనవరి 12**

ఆంధ్రప్రదేశ్లోవివిధ ప్రాంతాలకు చెందిన కళారూపాలకు మార్కెట్ కల్పించడంతో పాటు కళాకారులకు ఆర్థిక భరోసా లభించేలా లేపాక్షి షో రూమ్ ల్లో 30 శాతం వరకూ డిస్కౌంట్ అమ్మకాలు ప్రారంభించినట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆయా కళారూపాలను 10, 20, 30 శాతం డిస్కౌంట్లతో అమ్మకాలు చేస్తున్నామన్నారు. సంక్రాంతి పండగ దృష్ట్యా డిస్కౌంట్ అమ్మకాలు ప్రారంభించామన్నారు. దీనివల్ల కళారూపాలను తక్కువ ధరలకే లభించడంతో పాటు అదే సమయంలో అమ్మకాలు పెరగడం వల్ల కళాకారులకు ఉపాధి పెరిగే అవకాశముందని తెలిపారు. రాష్ట్రంలో మూడు లేపాక్షి షో రూమ్ లను వినియోగదారులకు ఆకట్టుకునేలా అభివృద్ధి చేయనున్నామని, ఇందుకోసం ఒక్కో షో రూమ్ నకు రూ.15 లక్షల వరకు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. ఈ కామర్స్ లోనూ కళారూపాలను అందుబాటులో ఉంచాలని, ఇందు కోసం ప్రత్యేక వెబ్ సైట్ ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో లేపాక్షి అధికారులతో మంత్రి సవిత సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సంక్రాంతి పండగను దృష్టిలో పెట్టుకుని కళారూపాల అమ్మకాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కళారూపాలకు ఉన్న డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని 10, 20 30 శాతంతో డిస్కౌంట్ అమ్మకాలు ఏ మేరకు జరుగుతున్నాయో మంత్రి సవిత అడిగి తెలుసుకున్నారు. లేపాక్షి షో రూమ్ ల్లో ఈ నెలాఖరు వరకూ జరిగే డిస్కౌంట్ అమ్మకాలపై మీడియా, సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయాలన్నారు.



**విడతల వారీగా షో రూమ్ ల అభివృద్ధి**

రాష్ట్రంతో పాటు దేశంలో ఇతర ప్రాంతాల్లో 19 లేపాక్షి షో రూమ్ లు ఉన్నట్లు ఆ సంస్థ ఎండీ విశ్వ తెలిపారు. వాటిలో 16 షో రూమ్ లు ఏపీలోనే ఉన్నాయన్నారు. దీనిపై మంత్రి సవిత స్పందిస్తూ, ప్రస్తుత తరం ఆలోచనలు, అభిరుచులకు అనుగుణంగా లేపాక్షి షో రూమ్ లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వినియోగదారులను ఆకట్టుకునేలా ఆ నిర్మాణాలు ఉండాలన్నారు. మొదటి విడతలో విశాఖపట్నం, అనంతపురం, కడప లేపాక్షి షో రూమ్ లను అభివృద్ధి చేయనున్నామన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక్కో షో రూమ్ కు రూ.15 లక్షల చొప్పున వెచ్చిస్తోందన్నారు. ఇప్పటికే చేపట్టిన ఢిల్లీలో ఉన్న లేపాక్షి షో రూమ్ అభివృద్ధి పనులు గురించి మంత్రి వాకబు చేశారు. మిగిలిన 15 షో రూమ్ లను విడతల వారీగా అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.

**ఆన్ లైన్ లో కళారూపాల అమ్మకాలు**

చేనేత వస్త్రాలను ఈ కామర్స్ లో విక్రయించినట్లు లేపాక్షి కళారూపాలను ఆన్ లైన్ లో లభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సవిత ఆదేశించారు. మారుతున్న పరిస్థితులతో వినియోగదారులు షాపులకు వచ్చి కొనుగోలు చేయడానికి వెనుకాడుతున్నారన్నారు. నిత్యావసరాలు, వస్త్రాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను సైతం ఆన్ లైన్ లోనే కొనుగోలు చేస్తున్నారన్నారు. వినియోగదారుల్లో వచ్చిన మార్పులకు అనుగుణంగా వివిధ ప్రాంతాలకు చెందిన కళారూపాలను ఆన్ లైన్ లో విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక వెబ్ సైట్ ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో లేపాక్షి ఎండీ విశ్వ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రపై వైసీపీ గురి

**విశాఖపట్టణం :** ఉత్తరాంధ్రపై వైసీపీ స్పెషల్ ఫోకస్ పెట్టింది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన, అతిపెద్ద నగరంగా ఉన్న విశాఖ పార్లమెంట్ సీటుపై అయితే అంతకు మించి కాన్సన్ట్రేషన్ పెట్టింది. వైసీపీ ఆవిర్భావం నుంచి..అక్కడ పూర్తి స్థాయి పట్టు సాధించలేకపోవడం ఫ్యాన్ పార్టీని కలవరపెడుతోందట. రాష్ట్రంలో అన్ని చోట్లా జెండా రెపరెపలాడినా, సాగర నగరం విశాఖలో మాత్రం పాతుకుపోవడం కుదరట్లేదట. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభంజనంలో ట్రయాంగిల్ ఫైట్లో విశాఖ ఎంపీ సీటును వైసీపీ గెలిచినా సరే, అసెంబ్లీ స్థానాల్లో ఒక్కటి కూడా గెలవలేకపోయింది.ఇటీవల ఎన్నికల్లో కూటమి అబ్యర్థులు విశాఖలో స్టేట్ లెవల్ రికార్డు స్థాయి మెజార్టీలు సాధించగా, వైసీపీ అభ్యర్థులు కనీస పోటీని ఇవ్వలేక చేతులెత్తేశారు. పరిస్థితి ఇలానే కొనసాగితే ఫ్యూచర్లో ఇక కోలుకునే పరిస్థితి ఉండదని వైసీపీ పెద్దలు ఆలోచనలో పడ్డారట. అందుకే విశాఖపై వైసీపీ ఫుల్ ఫోకస్ పెట్టిందని టాక్.పార్టీకి సవాల్గా మారిన విశాఖ ఎంపీ స్థానంలో ఇంచార్జ్గా బలమైన నేతను బరిలోకి దింపాలని వైసీపీ పకడ్బందీగా పావులు కదుపుతోందట. గత ఎన్నికల్లో వైసీపీ నుంచి విశాఖ ఎంపీ అభ్యర్థిగా..సీనియర్ నాయకుడు బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ పోటీ చేశారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలమైన నాయకురాలిగా ఉన్న ఆమెను పార్టీ బరిలో నిలిపితే గౌరవ ప్రదమైన ఓట్లను కూడా సాధించలేకపోయారు. కనీసం 30 శాతం ఓట్లను కూడా సాధించలేక చితికిలపడ్డారు.గత ఎన్నికల ఫలితాల తర్వాత బొత్స ఝాన్సీ సొంతూరు విజయనగరం జిల్లాకు మాత్రమే పరిమితమై, విశాఖ వైపు కన్నెత్తి చూడటం మానేశారు. గత కొన్నాళ్లుగా విశాఖకు చెందిన అంశాలపై రాజకీయంగా రచ్చ రచ్చ జరుగుతున్నా సరే ఆమె ఎక్కడా కనపడట్లేదు. పోనీ విజయనగరంలోనైనా సరే పార్టీ యాక్టివిటీలో ఆమె వాయిస్ ఎక్కడా వినిపించడం లేదు. అయితే బొత్స ఝాన్సీ ఇప్పుడు విశాఖ ఎంపీ స్థానంలో బాధ్యతలు చేపట్టడానికి సముఖంగా లేరని తెలుస్తోంది. పార్టీ అధిష్టానం కూడా ఇదే అంశాన్ని గ్రహించిందట. దీంతో విశాఖ పార్లమెంట్ పరిధిలో పార్టీని బలోపేతం చేసేలా బలమైన నాయకుడి కోసం టార్చ్ ఆన్ చేసి సెర్చ్ చేస్తోందని టాక్.స్టీల్ సిటీ విశాఖలో పార్టీకి ఉక్కు లాంటి నేత కోసం వైసీపీ పెద్దలు వెతుకాలట మొదలుపెట్టారట. ఎంత సెర్చ్ సరే



సరైన ఆప్షన్ కనబడట్లేదంటున్నారు. దీంతో సరికొత్త ప్లాన్ దిశగా పార్టీ పెద్దలు అడుగులు వేస్తున్నట్లు రాజకీయవర్గాల్లో ప్రచారంలో ఉంది. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ను రాబోయే ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేయించే ప్లాన్ చేశారట. కానీ గుడివాడ అమర్నాథ్ ఎట్టి పరిస్థితుల్లో ఎంపీగా పోటీ చేయనని..తనకు స్టేట్ పాలిటిక్స్ అంటేనే ఇష్టమంటున్నారట. మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచి క్యాబినెట్లో అడుగు పెట్టాలనేది ఆయన కల అంటున్నారు. దీంతో గతంలో విశాఖ పార్లమెంట్కు వైసీపీ నుంచి ఎన్నికైన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎంవీవీ సత్యనారాయణనే ప్రస్తుతానికి బెస్ట్ ఆప్షన్గా భావిస్తున్నారట.గత ఎన్నికల్లో విశాఖ ఈస్ట్ నుంచి అసెంబ్లీకి పోటీ చేసి ఓడిపోయిన ఆయన్ను తిరిగి రీయాక్టివేట్ చేయడం ద్వారా క్యాడర్కు మంచి సంకేతాలు పంపాలన్నది వైసీపీ ప్లాన్ అంటున్నారు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ఎంవీవీ కూడా ఎక్కడా యాక్టీవ్గా కనిపించడం లేదు. పొలిటికల్గా పూర్తిగా సైలెంట్ అయిపోయారు. తన వ్యాపార, వ్యవహారాలను మాత్రమే చక్కబెట్టుకుంటున్నారు. వైసీపీకి అంటీముట్టనట్లుగా ఉంటూ..పార్టీని గాలికి వదిలేశారు. అయినా ఆయనపై అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పైగా పార్టీ అధినేత జగన్తో జరిగే ప్రతీ సమావేశానికి ఎంవీవీకి ఇప్పటికీ ఆహ్వానం పంపుతూనే ఉన్నారట.ఆయన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకున్నా..వైసీపీ పెద్దలు మాత్రం ఆయన్ను దూరం పెట్టినట్లు కనిపించడం లేదు. దీంతో ఇప్పుడు ఎంవీవీని యాక్టివేట్ చేస్తే విశాఖ ఎంపీ సీటుతో పాటుగా ఈ పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లోని క్యాడర్కు ఊపు వస్తుందని పార్టీ అగ్రనేతలు భావిస్తున్నారట. కూటమి అధికారంలోకి రాగానే ఎంవీవీకి చెందిన హయగ్రీవ ప్రాజెక్ట్స్, సిరిపురంలోని ఎంవీవీ పీక్ వంటి భారీ నిర్మాణాలపై కన్నెర్ర చేసింది. దీంతో ఎంవీవీ పొలిటికల్గా అండర్ గ్రౌండ్లోకి వెళ్లిపోయారు. ఇప్పుడు వైసీపీ పెద్దలు ఆయన్ను రియాక్టివేట్ చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలకు ఎంవీవీ గ్రీన్సిగ్నల్ ఇస్తారా..లేక కూటమి పవర్లో ఉందని మొహం చాటేస్తారా..అన్నది క్లారిటీ రావాలంటే మరికొన్నాళ్లు ఆగాల్సిందే.

# రాజధాని రచ్చ

**అమరావతి :** అమరావతి రాజధాని విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అవలంబిస్తున్న తీరు రాజకీయ వర్గాల్లోనే కాకుండా సామాన్య ప్రజల్లోనూ తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒక ప్రధాన రాజకీయ పార్టీ రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించిన కీలకమైన అంశంపై కాలక్రమేణా తన వైఖరిని మార్చుకుంటూ రావడం, ఆ పార్టీ రాజకీయ పరిపక్వతను , విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తోంది.రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సాక్షిగా అమరావతిని రాజధానిగా నిర్ణయించినప్పుడు, అప్పటి ప్రతిపక్ష నేతగా జగన్ మోహన్ రెడ్డి హృదయపూర్వకంగా ఆమోదం తెలిపారు. రాజధాని కనీసం 30 వేల ఎకరాల్లో ఉండాలి, అప్పుడే అది మహా నగరమవుతుంది అని ఆనాడు ఆయన చేసిన ప్రసంగాలు నేటికీ రికార్డుల్లో ఉన్నాయి. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే 33 వేల ఎకరాల సేకరణను తప్పుబట్టడం, దానిని ఒక రియల్ ఎస్టేట్ కుంభకోణంగా చిత్రించడం ప్రజల్లో మొదటి అనుమాన బీజాన్ని నాటింది. 2019 ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు కంటే గొప్పగా అమరావతిని నిర్మిస్తాం అని ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్, అనూహ్యంగా మూడు రాజధానుల నినాదాన్ని తెరపైకి తెచ్చారు. వికేంద్రీకరణ పేరుతో అమరావతిని కేవలం శాసన రాజధాని కే పరిమితం చేయడం వల్ల వేల సంఖ్యలో రైతులు రోడ్డున పడ్డారు. ఐదేళ్ల పాటు అభివృద్ధిని పూర్తిగా నిలిపివేసి, న్యాయస్థానాల్లో కేసులు వేస్తూ కాలయాపన చేయడం వల్ల రాజధాని ప్రాంతం ఒక శిథిలారణ్యంగా మారిందిమూడు రాజధానుల విధానానికి మద్దతు లభించలేదు. ఎన్నికల్లో మునుపెన్నడూ లేని విధంగా 11 సీట్లకు పడిపోయిన తర్వాత, వైసీపీ తన పంథాను మార్చుకున్నట్లు కనిపించింది. మళ్ళీ తాము కూడా అమరావతినే రాజధానిగా కొనసాగిస్తామని సజ్జల ప్రకటించారు. కానీ ఇప్పుడు కొత్తగా అమరావతిని నదీగర్భంలో కడుతున్నారంటూ జగన్ చేస్తున్న వ్యాఖ్యలు మరో కొత్త గందరగోళానికి తెరలేపాయి. రివర్ బేసిన్ అంటే ఏమిటో స్పష్టత లేకుండా ఇటువంటి ఆరోపణలు చేయడం కేవలం అభివృద్ధిని అడ్డుకోవడమేనని విమర్శలు వస్తున్నాయి. గతంలో ఇదే అమరావతిలో తన నివాసాన్ని నిర్మించుకున్నప్పుడు లేని పర్యావరణ ముప్పు, ఇప్పుడు ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటేనే కనిపిస్తోందా అని సామాన్య జనం ప్రశ్నిస్తున్నారు.రాజకీయాల్లో వ్యూహాలు మారవచ్చు కానీ, ఒక రాష్ట్ర మనుగడకు సంబంధించిన ప్రాజెక్టుపై విధానం మాటిమాటికీ మారకూడదు. జగన్ , వైసీపీ అనుసరిస్తున్న ఈ “యూ-టర్న్” రాజకీయం వల్ల ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకం సడలుతోంది. ఒకసారి రాజధాని అని, మరోసారి కాదని, మళ్ళీ అవునని, ఇప్పుడు మునిగిపోతుందని చెప్పడం ద్వారా వైసీపీ తన సొంత కేడర్ను కూడా అయోమయంలో పడేస్తోంది. నిత్యం మాట తప్పను.. మడమ తిప్పను అని చెప్పే నాయకుడు, రాజధాని విషయంలో ఇన్నిసార్లు మాట మార్చడం ఆయన రాజకీయ జీవితంలో ఒక పెద్ద మైనస్గా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ప్రజలు రాజకీయ పార్టీల నుంచి ఆశించేది స్థిరత్వం. ఈ గందరగోళం ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో కూడా ప్రజల నుంచి సానుకూల స్పందన రావడం కష్టమే. ఇప్పటికైనా విమర్శల కోసం విమర్శలు మానేసి, నిర్మాణాత్మకమైన వైఖరిని అవలంబించడమే ఆ పార్టీకి శ్రేయస్కరం అనేది ఎక్కువ మంది భావన.

## పోలవరం అద్భుతమైన ప్రాజెక్టు

-మొదటిపేజీ తరువాయి

ప్రాజెక్టు అని చంద్రబాబు చెప్పారు. అభివృద్ధిలో రైతులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. పోలవరం అద్భుతమైన ప్రాజెక్టు అని.. అది పూర్తయితే దక్షిణ భారతంలో ఏ రాష్ట్రమూ మనతో పోటీ పడలేదని చెప్పారు. నల్లమలసాగర్ ద్వారా రాయలసీమ ప్రాంతంతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు నీరు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఎవరికీ నష్టం లేదన్నారు. ఎగువ నుంచి వదిలిన నీళ్లు పోలవరం నుంచి నల్లమల సాగర్కు తీసుకెళ్లి వాడుకుంటే తప్పేంటని ప్రశ్నించారు. పోలవరంలో మిగిలిన నీటిని తెలంగాణ కూడా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆ రాష్ట్రంలో ప్రాజెక్టులు కట్టినప్పుడు తానెప్పుడూ అడ్డు చెప్పలేదని సీఎం గుర్తుచేశారు. భోగాపురం ఎయిర్పోర్టును త్వరలోనే జాతికి అంకితం చేస్తామన్నారు. విశాఖ స్టీల్ప్లాంట్ను కేంద్ర ప్రభుత్వ సహకారంతో కాపాడుకున్నామని వివరించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల సెంటిమెంట్ అని.. ఆ ప్లాంట్ను నిలబెట్టి తీరుతామన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని తెలిపారు. పెట్టుబడులకు డెస్టినేషన్గా రాష్ట్రం మారిందన్నారు. ఎస్ఐపీబీ ద్వారా రూ.8.74లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపామని.. వాటి ద్వారా కూడా పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయన్నారు.

## గడ్కరీ వేగం అందరికీ తెలుసు...

బెంగళూరు-విజయవాడ ఎకనామిక్ కారిడార్ నిర్మాణంలో నాలుగు గిన్నిస్ ప్రపంచ రికార్డులు సాధించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించిన ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు. మంత్రులు, కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో కలిసి ఈ విజయోత్సవ కార్యక్రమంలో వర్చువల్గా పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. “కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పనిచేసే వేగం, సామర్థ్యం దేశంలో అందరికీ తెలుసు. ఆయన నాయకత్వంలో ప్రపంచస్థాయి రికార్డు సాధించడం గర్వకారణం,“ అని కొనియాడారు. వేగంగా, అత్యంత పొడవైన 6 లేన్ల బిటుమిన్ రహదారిని నిర్మించి గిన్నీస్ రికార్డు సాధించిన రాజ్ పథ్ ఇన్ ఫ్రా కామ్ సంస్థను ప్రత్యేకంగా అభినందించారు. జనవరి 6 నుంచి 11వ తేదీ వరకు కేవలం ఐదు రోజుల్లో ఏకబిగిన 52 కిలోమీటర్ల మేర 6 లేన్ల రహదారిని నిర్మించారని, అదేవిధంగా నిరంతరాయంగా 10,655 మెట్రిక్ టన్నుల బిటుమిన్ కాంక్రీట్ను వేసి మరో ప్రపంచ రికార్డు నెలకొల్పారని వివరించారు. దీంతో పాటు 84.4 కిలోమీటర్ల నాలుగు లేన్ల రహదారి నిర్మాణ రికార్డును కూడా తిరగరాసినట్లు పేర్కొన్నారు. అమరావతి నుంచి బెంగళూరుకు నేరుగా నిర్మించ తలపెట్టిన రహదారికి ‘అమరావతి-బెంగళూరు రోడ్డు‘గా పేరు పెట్టాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. బృందంగా పనిచేసి ఈ విజయాన్ని అందుకున్న అందరికీ మరోసారి అభినందనలు తెలియజేశారు.

## అమరావతిలో జోరుగా రెండో విడత ల్యాండ్ పూలింగ్..

-మొదటిపేజీ తరువాయి

ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకి రైతులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ రెండో దశలో మొత్తం 7 గ్రామాల్లో భూసమీకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో పల్నాడు జిల్లా అమరావతి మండలంలో వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి, లేమల్లె... గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలో వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాలు ఉన్నాయి. ఇప్పటివరకు 4 గ్రామాల్లో ప్రక్రియ ప్రారంభమైంది (కర్లపూడి-లేమల్లెతో సహా). ఈ భూములను అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడా నగరం (ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ), స్మార్ట్ పరిశ్రమలు, రైల్వే ట్రాక్, ఇన్నర్ రింగ్ రోడ్ వంటి పెద్ద ప్రాజెక్టుల కోసం ఉపయోగించనున్నట్టు తెలుస్తోంది. మొదటి దశలో 34,000 ఎకరాలు ఇప్పటికే పూల్ అయ్యాయి, ఇప్పుడు ఇంకా విస్తరణతో అమరావతి మరింత పెద్ద నగరంగా మారనుంది.

## వైసీపీ విష ప్రచారం చేస్తోంది




వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి భక్తుల మనోభావాలపై దండయాత్ర చేస్తున్నారని, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా అబద్ధాలతో విష ప్రచారం సాగిస్తున్నారని రాష్ట్ర సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం నాడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ప్రజల సంతృప్తే లక్ష్యంగా పనిచేస్తుంటే, వైసీపీ మాత్రం విధ్వంసక ధోరణి వీడటం లేదన్నారు. అబద్ధాలను ప్రచారం చేయడంలో గతంలో ‘గోబెల్స్‘ పేరు వినేవాళ్లమని, ఇప్పుడు జగన్ బృందం తీరు చూస్తుంటే దాన్ని ‘జగన్ బెల్స్‘ ప్రచారం అని పిలవాల్సి వస్తోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపడానికి, జీఎస్డీపీ, తలసరి ఆదాయం పెంచడానికి నిరంతరం శ్రమిస్తున్నారని పార్థసారథి తెలిపారు. అయితే, అధికారం కోల్పోయిన వైసీపీ నేతలు అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై పోరాడాల్సింది పోయి, ప్రభుత్వంపై బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. వారి తీరు చూస్తుంటే “వంద ఎలుకలు తిన్న పిల్లి కాశీ యాత్రకు వెళ్లినట్లు“ఉందని, రాష్ట్ర ఆదాయానికి కీలకమైన ఆధ్యాత్మిక పర్యాటకాన్ని దెబ్బతీయడానికి కంకణం కట్టుకున్నారని మండిపడ్డారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేందుకు వైసీపీ పెద్ద కుట్ర పన్నిందని పార్థసారథి ఆరోపించారు. ఇటీవల తిరుమలలో మద్యం సీసాలు దొరికాయని చేసిన ప్రచారం వెనుక వైసీపీ నేతల హస్తం ఉందని అన్నారు. “తిరుపతిలో ఖాళీ మద్యం సీసాలను కొనుగోలు చేసి, వాటిని కొండపైకి తీసుకెళ్లి పెట్టి.. అపవిత్రం జరిగిందని నమ్మించే ప్రయత్నం చేశారు. చంద్రబాబు గారు ఏర్పాటు చేసిన వేల సీసీ కెమెరాల వల్ల ఈ కుట్ర బయటపడింది. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారు పోలీసులకు చిక్కారు. వారు సాక్షి పత్రిక విలేకరులో లేదా భూమన కరుణాకర్ రెడ్డి అనుచరులో అని తిరుపతిలో చర్చ జరుగుతోంది“ అని ఆయన వివరించారు. గతంలో వెంకటేశ్వర స్వామిని ‘నల్లరాయి‘ అని కించపరిచిన భూమన, ఇప్పుడు ఒంటినిండా నామాలు పెట్టుకుని హిందువునని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. వైసీపీ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం కోసం వాడిన నెయ్యిలో కనీసం 20 శాతం స్వచ్ఛత కూడా లేదని, పామాయిల్, జంతువుల కొవ్వు కలిసిందన్న ఆరోపణలపై విచారణ జరుగుతోందని మంత్రి వెల్లడించారు. కేవలం ముడుపుల కోసమే నాణ్యత లేని సంస్థల నుంచి నెయ్యి కొన్నారని ఆరోపించారు. దేవుడిపై నమ్మకం లేని భూమనకు ఛైర్మన్ పదవి ఇచ్చి, తిరుమల నిధులను భక్తుల సౌకర్యాలకు కాకుండా తిరుపతిలో రాజకీయ లబ్ధి కోసం ఖర్చు చేశారని దుయ్యబట్టారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో సాక్షులు అనుమానాస్పదంగా మరణించినట్లే, వైసీపీ హయాంలో జరిగిన పరకామణి దొంగతనం కేసులో సాక్షిగా ఉన్న అధికారి కూడా రైలు కింద పడి చనిపోవడం వెనుక ఉన్న మిస్టరీ ఏమిటని ప్రశ్నించారు. గోవిందరాజస్వామి ఆలయంలో బంగారు తాపడం కోసం వాడాల్సిన కిలోల కొద్దీ బంగారాన్ని సైతం దోచేశారని ఆరోపించారు. గత ఐదేళ్ల తమ దోపిడీని కప్పిపుచ్చుకోవడానికే వైసీపీ ఇలాంటి తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని, ప్రజలు వాస్తవాలను గమనించాలని కోరారు. “మీరు అభివృద్ధికి సహకరించకపోయినా ఫర్వాలేదు, కనీసం నోరు మూసుకుని ఉండి రాష్ట్రంపై విషం చిమ్మకండి“ అని వైసీపీ నేతలకు ఆయన హితవు పలికారు.

## అనపర్తి నియోజకవర్గంలో హిందూ దేవాలయాల పట్ల

# కూటమి ప్రభుత్వ వైఖరిపై ధ్వజం ఎత్తిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి

- కొత్తూరు గ్రామంలో ప్రైవేట్ వ్యయంతో నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్టను చివరి నిమిషంలో అడ్డుకున్నారు
- విగ్రహాలను వెనక్కి పంపించి, ఆలయం చుట్టూ 144 సెక్షన్, బారికేడ్ల ఏర్పాటు
- భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిన చర్యలని మాజీ శాసనసభ్యులు విమర్శ
- అనపర్తి విష్ణాలయం వద్ద ఫెన్సింగ్ వల్ల పార్కింగ్, పూజా కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం
- కుతుకులూరులో అభయాంజనేయ స్వామి గుడి నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు
- ఆలయానికి చెందాల్సిన రూ.15 లక్షల వడ్డీ నష్టం
- ఎమ్మెల్యే తక్షణమే బాధ్యత వహించాలని మాజీ శాసనసభ్యులు డిమాండ్





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జనవరి 12:** అనపర్తి నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం, ముఖ్యంగా బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి హిందూ దేవాలయాల పట్ల అనుసరిస్తున్న తీరుపై అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ సమన్వయకర్త, మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనపర్తి మండలం కొత్తూరు గ్రామంలో ఒక ప్రైవేట్ వ్యక్తి సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ఆలయంలో విగ్రహ ప్రతిష్టను చివరి నిమిషంలో అడ్డుకోవడం, అప్పటికే తీసుకొచ్చిన విగ్రహాలను వెనక్కి పంపించడం, ఆలయం చుట్టూ 144 సెక్షన్ విధించి బారికేడ్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని అన్నారు.

అదేవిధంగా, అనపర్తి విష్ణాలయం వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం వల్ల పార్కింగ్‌తో పాటు పూజా కార్యక్రమాలకు, భక్తుల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని విమర్శించారు. ఇక కుతుకులూరు గ్రామంలోని అభయాంజనేయ స్వామి గుడికి సంబంధించిన సుమారు రూ.70 లక్షల నిధులను ఒక తెలుగుదేశం పార్టీ నాయకుడి వద్ద ఉంచడాన్ని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించిన అనంతరం మాత్రమే అసలు మొత్తం తిరిగి ఇచ్చారని తెలిపారు. అయితే ఆ నిధులపై ఆలయానికి రావాల్సిన సుమారు రూ.15 లక్షల వడ్డీ నష్టాన్ని ఇప్పటికీ చెల్లించలేదని ఆరోపించారు.

ఆఖరికి దేవుడి సొమ్ముతో వ్యాపారాలు చేసే స్థాయికి పాలకులు దిగజారడం దురదృష్టకరం అని మాజీ శాసనసభ్యులు డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి మండిపడ్డారు. ఈ అపచారాలన్నింటికీ ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డి నైతిక బాధ్యత వహించాలని, వెంటనే అనపర్తి విష్ణాలయం వద్ద ఫెన్సింగ్ తొలగించాలి, కొత్తూరు ఆలయంలో విగ్రహ ప్రతిష్టను జరిపించాలని డిమాండ్ చేశారు. చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలని స్పష్టం చేశారు. "నువ్వు నకిలీ బీజేపీ ఎమ్మెల్యేవి. ఈవీఎంల సహకారంతో గెలిచావు. అందుకే నీకు దేవుడంటే భయం లేదు ప్రజలంటే గౌరవం లేదు"అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇకనైనా హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించవద్దని మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి హెచ్చరించారు.

# ఇంటర్ పరీక్షలను సజావుగా నిర్వహించండి :డిఆర్ఓ మలోలా

**అంకుశం న్యూస్ అనంతపురం జనవరి 12 :** అనంతపురం జిల్లాలో జనవరి 21 నుండి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమవుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను సజావుగా నిర్వహించే విధంగా సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ఇంటర్ పరీక్షలను విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మలోల ఆదేశించారు.
సోమవారం రెవెన్యూ భవన్ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖ అధికారులతో డిఆర్ఓ సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్ పరీక్షల నిర్వహణ ప్రక్రియ విజయంతో మొదటకు ఆయా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్ల కొరకుముందస్తుచర్యలుతీసుకొని పూర్తి చేయాలన్నారు.
జనవరి 21వ తేదీన ఎథిక్స్ మరియు హ్యూమన్ వాల్యూస్ 23న ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ పరీక్షలు ఉదయం 10 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటాయని తెలిపారు. 20 పరీక్ష కేంద్రాలలో ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు జనవరి 27 నుండి ఫిబ్రవరి 10వ తేదీ వరకు 15 రోజులు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మరియు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆదివారాలలో కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించబడుతున్నట్లు డిఆర్ఓ పేర్కొన్నారు. అలాగే 83 పరీక్ష కేంద్రాలలో జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1 నుండి 10వ తేదీ వరకు పది రోజులు ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు మరియు మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు ఆదివారాలలో కూడా ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని జిల్లావ్యాప్తంగా 9900 మంది విద్యార్థులు ప్రాక్టికల్స్ పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే 64 థియరీ పరీక్షలు కేంద్రాలలో 48 146 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని ఈ తీరి పరీక్షలు ఫిబ్రవరి 23 నుండి మార్చి 24 వరకు ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని 64 పరీక్ష కేంద్రాలలో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయవలసిందిగా డిఆర్ఓ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. . ఈ సమావేశంలో ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటరమణ నాయక్, వృత్తి విద్యాశాఖ అధికారి గురువయ్య పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు శ్రీమతి నాగరత్నమ్మ , కృష్ణమూర్తి వెంకటస్వామి వైద్య ఆరోగ్య కార్మిక పోలీసు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## జనవరిలోనే మోడీకి కొత్త ఆఫీస్

**న్యూఢిల్లీ :** సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో భాగంగా నూతన పార్లమెంట్ భవనం నిర్మాణం పూర్తయి.. అందులోనే కార్యకలాపాలు జరుగుతున్నాయి. తాజాగా, ప్రధాని నరేంద్ర మోదీ కొత్త కార్యాలయం 'సేవా తీర్థ్' సిద్ధమైంది. సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన ఈ అత్యాధునిక కార్యాలయం ఈ నెలలోనే అందుబాటులోకి రానుంది. ఇందులో ప్రధాని ఆఫీసు, క్యాబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా మండలి కార్యాలయాలు ఉంటాయి. సౌత్, నార్త్ బ్లాక్‌లను పురాతన భారతీయ నాగరికతను తెలిపే మ్యూజియంగా మార్చనున్నారు.ఢిల్లీలోని రైసినా హిల్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొత్త కార్యాలయం దాదాపు సిద్ధమయ్యింది. భవనానికి తుది మెరుగులు దిద్దుతుండగా.. కొత్త ఆఫీసులోకి ప్రధాని మోదీ ఈ నెలలోనే అడుగుపెట్టనున్నారు. సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో భాగంగా రైసినా హిల్‌లో ప్రధాన మంత్రి కార్యాలయం నిర్మాణం చేపట్టారు. దీనికి 'సేవా తీర్థ్' అని నామకరణం చేశారు. ఇందులో మొత్తం మూడు భవనాలు ఉండగా.. ఒకటి ప్రధాని ఆఫీసు, రెండోది క్యాబినెట్ సెక్రటేరియట్, మూడోది జాతీయ భద్రతా మండలి కార్యాలయం ఏర్పాటుచేస్తున్నారు. సెంట్రల్ విస్టా ప్రాజెక్ట్‌లో ఇప్పటికే పార్లమెంట్ భవనం, ఉప-రాష్ట్రపతి నిలయం అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే.ప్రధాని కార్యాలయం దాదాపు పూర్తి కాగా.. ఎనిమిది మంత్రిత్వ

# పోరుమామిళ్లలో శ్రీ అభిరామ్ ఆసుపత్రి ప్రారంభోత్సవం

## - హాజరైన విజయమ్మ, రితేష్ రెడ్డి

**.పోరుమామిళ్ల, జనవరి 12(అంకుశం పత్రిక):** పట్టణంలోని వెంకటేశ్వర దేవాలయం ప్రక్కన డాక్టర్ పి.సుధీర్ కుమార్, డాక్టర్ ప్రత్యూష ఆధ్వర్యంలో ప్రీడియాట్రిక్, గైనిక్ కు సంబంధించి నూతనంగా శ్రీ అభిరామ్ పేరుతో సోమవారం ప్రయివేట్ ఆసుపత్రి ప్రారంభించబడింది. మాజీ ఎంఎల్ఏ విజయమ్మ, టీడీపీ బద్వేల్ నియోజకవర్గం ఇంచార్జ్ రితేష్ రెడ్డి ముఖ్య అతిధిలుగా హాజరై ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ సందర్బంగా రితేష్ రెడ్డి, విజయమ్మ మాట్లాడుతూ...ఒక భాద్యతగా ప్రజలకు వైద్య సేవలు అందించడం గొప్ప అనుభూతి, ఆత్మ సంతృప్తి లభిస్తుంది అన్నారు. పోరుమామిళ్ల చుట్టు ప్రక్కల గ్రామాలు, మండలాల ప్రజల కోసం చక్కటి వసతులతో ఆసుపత్రిని ప్రారంభించిన డాక్టర్ల దంపతులను అభినందించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ ఉజ్వల భవిష్యత్ ను అందుకోవాలన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కూటమి అభ్యర్ధి బొజ్జా రోశన్న, రోడ్డు డెవలప్మెంట్ అథారిటీ డైరెక్టర్ రంతు, వైఎస్ఆర్సీపి బద్వేల్ నియోజక వర్గం అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ్ రెడ్డి, బద్వేల్ మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మెన్ బసిరెడ్డి రవీంద్రారెడ్డి, పోరుమామిళ్ల మేజర్ పంచాయితీ సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సీతావెంకట సుబ్బయ్య, శెట్టెం ప్రతాప్, కొండా కృష్ణారెడ్డి, లేత్ మిషన్ షరీఫ్, ఇమామ్ హుస్సేన్, కలవకూరి రమణ, పంగా రవీంద్రారెడ్డి, మురుకూటి విజయకుమార్ రెడ్డి, కొండా రామకృష్ణా రెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, అధికారిరాజ, ప్రజలు పాల్గొన్నారు.



# దేశీ బుల్లెట్‌లో రాకెట్!

"ఎప్పుడొచ్చామన్నది కాదన్నయ్యా... బుల్లెట్ దిగిందా లేదా?" అంటాడో హీరో. ఇప్పుడీ డైలాగును ఐఐటీ మద్రాస్ కూడా గర్వంగా కొట్టేయవచ్చు. అవును మరి.. ప్రపంచంలోని ఏ దేశానికీ లేని సరికొత్త, వినూత్నమైన తుపాకీ గుండును ఈ సంస్థ విజయవంతంగా తయారు చేసి పరీక్షించింది కూడా. ఈ సరికొత్త తుపాకీ గుండును, ధనుష్ హోవిట్జర్, కే-9 వజ్ర-టీ, బోఫోర్స్ వంటి తుపాకుల్లో పెట్టి కాల్చామను కోండి... ఒకొక్కటీ మామూలు బుల్లెట్ల కంటే సగం దూరం ఎక్కువ ప్రయాణిస్తాయి. అదే సమయంలో వీటి విధ్వంసక శక్తి ఏమాత్రం తగ్గకపోవడం విశేషం. ఈ అద్భుత ఆవిష్కరణ విశేషాలు...
దేశ సరిహద్దుల రక్షణలో శతఘ్ని వ్యవస్థల పాత్ర చాలా కీలకం. అయితే వీటితో ఒక చిక్కుంది. ధనుష్ హోవిట్జర్‌సహా 155 మిల్లీమీటర్ల గుండ్లు వాడే తుపాకులు ప్రయాణించగలిగే దూరం 40 కిలోమీటర్లకు మించదు. అందుకే మన భద్రత దళాలు వీటిని సరిహద్దుల్లో అతి దగ్గరి నుంచి జరిపే దాడులకు మాత్రమే ఉపయోగిస్తుంటారు. కొంచెం ఎక్కువ దూరంలోని లక్ష్యాలను తాకాలంటే ప్రళయ్ (150 - 500 కిలోమీటర్లు) లేదా పినాక (40 - 90 కి.మీ)లు వాడాల్సి ఉంటుంది. తుపాకులతో పోలిస్తే రాకెట్లతో పనిచేసే క్షిపణుల తయారీ, మోహరించడం రెండూ వ్యయ, ప్రయాసలతో కూడుకున్నవే. ఇలా కాకుండా.. తూపాకులతోనే వంద కిలోమీటర్ల దూరాన్ని కూడా తాకగలిగితే...? ఐఐటీ మద్రాస్ అభివృద్ధి చేసి, విజయవంతంగా పరీక్షించిన రామ్‌జెట్ ఇంజిన్లు సరిగ్గా ఇదే పని చేస్తాయి.

**ఏమిటీ రామ్‌జెట్?**
రాకెట్ ఇంజిన్ మాదిరిగానే ఇది కూడా ఓ ఇంజిన్. అంతే. కాకపోతే.. రాకెట్ ఇంజిన్ల మాదిరి వీటిల్లో బోలెడన్ని విడిభాగాలు ఉండవు. గాలిని పీల్చుకుని, తనలోని ఇంధనానికి కలిపి ముందుకు దూసుకెళుతూంటుంది. ధ్వని కంటే మూడు నుంచి ఆరు రెట్లు ఎక్కువ వేగంతో వెళ్లగలదు. ఇంజిన్లతో పనిచేసే క్షిపణులు రష్యాతోపాటు ఫ్రాన్స్, ఇండియా, ఫ్రాన్స్, చైనా, స్వీడన్, యూకేల వద్ద మాత్రమే ఉన్నాయి. అగ్రరాజ్యం అమెరికా వద్ద కూడా లేవు. ఐఐటీ మద్రాస్ శాస్త్రవేత్తల పరిశోధనల పుణ్యమా అని ఇప్పుడు ఈ టెక్నాలజీ క్షిపణుల కంటే చాలా తక్కువ సైజులో ఉండే తుపాకీ గుళ్లలోకి చేరిపోయింది. భారత ఆర్మీ బోర్డు, ఐఐటీ మద్రాస్‌లు సంయుక్తంగా తయారు చేసిన రామ్‌జెట్ ఆధారిత తుపాకీ గుండ్లను ప్రోఖ్రాన్‌లో విజయవంతంగా పరీక్షించారు. ప్రొఫెసర్లు పి.ఎ.రామకృష్ణ, హెచ్ఎస్ఎన్ మూర్తి, జి.రాజేశ్, ఎం.రామకృష్ణ, మురుగయన్, లాజర్‌లతోపాటు విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ పి.ఆర్.శంకర్, లెఫ్టినెంట్ జనరల్ హరి మోహన్ అయ్యర్, డాక్టర్ యోగేశ్ కుమార్ వేలరిలతో కూడిన బృందం రామ్‌జెట్ ఆధారిత తుపాకీ గుండ్ల తయారీలో కీలకపాత్ర పోషించారు.

**క్షిపణుల్లోనూ వాడవచ్చు: ప్రొఫెసర్ రామకృష్ణ**
రామ్‌జెట్ టెక్నాలజీని బోఫోర్స్ మినహా ఇతర క్షిపణుల్లో వాడేందుకు తాము అభివృద్ధి చేసిన టెక్నాలజీ ఉపయోగపడు తుందని ఐఐటీ మద్రాస్‌లోని ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగపు అధ్యక్షుడు ప్రొఫెసర్ పి.ఎ.రామకృష్ణ తెలిపారు. ఈ దిశగా ఇప్పటికే కొన్ని ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలిపారు. తొలుత తాము 76 మిల్లీమీటర్ తుపాకులతో రామ్‌జెట్ ఆధారిత తుపాకీ గుండ్లను పరీక్షించి చూశఋూమని, ఆ తరువాత దశలవారీగా 155 మిల్లీమీటర్ల శతఘ్ని వ్యవస్థకు విస్తరించామని వివరించారు. గత ఏడాది సెప్టెంబరులో దియోలాలీలోని

## గొల్లల మామిడాడలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి,డీసీసీబీ చైర్మన్ తుమ్మల



**కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జనవరి 12:** 36 లక్షలు రూపాయలతో నిర్మించిన 5 సీసీ రోడ్లు ను, 67 లక్షలు రూపాయలతో మెటల్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన,16 లక్షల రూపాయలతో రెండు స్కూల్స్ కి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన, 10 లక్షల రూపాయలతో అసంపూర్తిగా ఉన్న ఎస్సి కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి శంకుస్థాపన చేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం సొసైటీ అధ్యక్షులు,సొసైటీ సభ్యులు,అనపర్తి నియోజకవర్గం కూటమి నాయకులు,పెదపూడి మండల కూటమి నాయకులు,గొల్లల మామిడాడ గ్రామ కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## వాడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ




**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జనవరి 12:** ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వాడపల్లి శ్రీవెంకటేశ్వర స్వామి వారి దర్శనం చేసుకుని వేద పండితుల ఆశీర్వచనం తీసుకుని అనంతరం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యనందరావు ఆహ్వానం మేరకు ఆత్రేయపురం సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొన్న తూర్పు డెల్టా వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి, కమిటీ సభ్యులు.

## ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు




**అంకుశం న్యూస్ ధర్మవరం జనవరి 12:** ధర్మవరం విశ్వదీప సేవా సంఘం కార్యాలయము నందు స్వామి వివేకానంద జయంతి (జాతీయ యువజన దినోత్సవం) జరిగింది. ముఖ్య అతిధి గా వేణు మోటార్స్ అధినేత వేణు హాజరై మాట్లాడుతూ స్వామి వివేకానంద గారి స్ఫూర్తితో యువత మంచి మార్గంలో నడుచుకుంటూ సమాజసేవ చేయాలని కొనియాడారు ఫౌండర్ కోళ్ళమొరం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద గారు దేశ విదేశాల్లో మన భారతదేశం కీర్తి ప్రతిష్టలు పెంచిన మహోన్నత వ్యక్తి అని మన ధర్మవరం లో స్వశక్తి తో ఎదిగి ఎంతోమంది యువతకు ఉపాధి అవకాశం కల్పిస్తూ ధర్మవరం ప్రతిష్ట పెంచుతున్న వేణు మోటార్స్ అధినేత వేణు గారిని ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని తెలియజేసినారు అధ్యక్షులు గాజుల సురేష్ సలహాదారుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వామి వివేకానంద గారు శ్రీ రామక్రిష్ణ పరమహంస గారి శిష్యుడుగా చేరి భారతదేశ పర్యటన చేస్తూ ఎంతో మంది యువతకు తన ప్రసంగాల ద్వారా ఆకర్షతులైనారు కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ు.చంద్రశేఖర్ రెడ్డి కార్యదర్శి జుజారు రఘు ప్రభాకర్ రెడ్డి చంద్ర, ఖమ్మం మాధవ మధు నాయుడు అక్కులప్ప, మనోహర ధనుంజయ, నాగ, సూరి, నారాయణస్వామి సుబ్రహ్మణ్యం వెంకటరమణ నాగేశం సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు

## ధనుర్మాసం సందర్భంగా వాసవి మహిళా మండలి ప్రత్యేక పూజలు !



**అంకుశం న్యూస్ ధర్మవరం జనవరి 12:** ధనుర్మాసం సందర్భంగా సోమవారం ధర్మవరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ, నారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మూలవిరాట్ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరింపజేశారు. ఈ సందర్భంగా వాసవి మహిళా మండల అధ్యక్షురాలు శ్రీ మతి పొలమడ రూపరాగిణి పాల్గొని, మాట్లాడుతూ, ధనుర్మాసం సందర్భంగా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి మహిళా మండలి సభ్యులు, ఆర్యవైశ్య సంఘం వాటి అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## విశ్వ హిందూ పరిషత్ ప్రత్యేక సమావేశం




**అంకుశం న్యూస్ ధర్మవరం జనవరి 12:** విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర ప్రాంత సమావేశములు, కర్నూలు లో జనవరి 10 ,11 శని, ఆదివారములు జరిగినవి.
ఈ సమావేశంలో శ్రీ సత్య సాయి జిల్లా విశ్వహిందూ పరిషత్ జిల్లా సమితి లోనికి ధర్మవరం నుండి శ్రీ దేవరకొండ రామానుజులు గారిని జిల్లా సహకార దర్శిగా, శ్రీ దుస్సా కృష్ణ గారిని జిల్లా విశేష సంపర్క్ ప్రముఖ్ గా,శ్రీ ా హర్షవర్ధన్ గారిని జిల్లా బజరంగ్ దళ్ సంయోజక్ గా, చీ మురళి మోహన్ రెడ్డి గారిని జిల్లా సహ ప్రచార ప్రముఖ్ గా బాధ్యతలు ప్రకటించడం అయినదని ధర్మవరం పులి చెర్ల వేణుగోపాల్ తెలిపారు.

# మహిళస్వయంగా ఆర్థికంగా ఎదగాలి

- ఆ దిశగా మహిళలు అడుగు వేయాలన్న ఎమ్మెల్యే పరిటాల సునీత
- ఐసీఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కిట్టుమిషన్లు పంపిణీ
- రామగిరిలో 400మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా మిషన్లు పంపిణీ





**అంకుశం న్యూస్ అనంతపురం జనవరి 12:** ప్రతి మహిళకు ఒక పని వచ్చి ఉండాలని.. వారు స్వయంగా ఆదాయం అర్జించే విధంగా ఉండాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఇన్ఫిన్స్ చారిటబుల్ ఫౌండేషన్ (ఐసీఎఫ్) సంస్థ ఆధ్వర్యంలో కిట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రామగిరి మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ స్వరాజ్యం సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, ఐసీఎఫ్ ఛైర్మన్ సూగేపల్లి విజయ్ కిశోర్, చల్లా కిషోర్ చౌదరి, వన్నూరు స్వామి, సరస్వతి తదితరలు పాల్గొన్నారు. మొత్తం 400మంది మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా కుట్టుమిషన్లు అందజేశారు. మహిళలు స్వయంగా ఉపాధి పొందే విధంగా ఏదో ఒక పని కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఐసీఎఫ్ చేస్తున్న ప్రయత్నం చాలా గొప్పదన్నారు. మహిళలకు ఉచితంగా కుట్టులో శిక్షణ ఇచ్చి.. 50శాతం సబ్సిడీతో మిషన్లు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇప్పటికే ఆత్మకూరు మండలంలో 2వేల మిషన్లు, రాప్తాడులో 800మంది మహిళలకు మిషన్లు అందజేశారన్నారు. వీటిని తీసుకున్న మహిళలు వాటిని పక్కన పెట్టకుండా.. ముందుగా ఇంట్లో వారి దుస్తులు కుట్టడం దగ్గర నుంచి పని మొదలు పెట్టాలన్నారు. కిట్టుమిషన్లలో ప్రతిభ సాధించగలిగితే రోజు వెయ్యి నుంచి 15వందల వరకు సంపాదించవచ్చన్నారు. ప్రభుత్వంతో కలసి ఇలాంటి సంస్థలు అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ఆర్థికంగా బాగుండాలన్న ఉద్దేశ్యంతో మొదటి నుంచి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అన్నింటా వారిని భాగస్వామ్యం చేస్తోందన్నారు. దాదాపు అన్ని పథకాలు వారి పేరు మీద ఉండేలా చేస్తోందన్నారు. మరోవైపు ఈ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తోందని.. మా ప్రాంతంలో కూడా అవసరం ఉన్న వారికి సైకిళ్లు ఇవ్వాలని కోరారు. గ్రామ స్వరాజ్య సంస్థతో పాటు ఐసీఎఫ్ ను ఎమ్మెల్యే సునీత ప్రత్యేకంగా అభినందించారు...

## బెంగుళూరు విజయవాడ ఎకనమిక్ కారిడార్ పై
# నాలుగు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల సృష్టి

**- అవార్డు అందుకున్న మంత్రి జనార్ధన్ రెడ్డి పాల్గొన్న ఎంపీ పార్థసారథి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**





**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి జనవరి 12:** శ్రీ సత్య సాయి జిల్లాలో బెంగళూరు -కడప -విజయవాడ ఎకనామిక్ కారిడార్ నిర్మాణ పనుల్లో గిన్నిస్ రికార్డులు సాధించిన సందర్భంగా... సోమవారం నల్లమాడ మండల సమీపంలో జాతీయ రహదారి 544జి పక్కన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఆర్ అండ్ బి శాఖామాత్యులు బిసి జనార్దన్ రెడ్డి, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఇందులో భాగంగా అమరావతి నుంచి వర్చువల్ గా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు నాగపూర్ నుంచి కేంద్ర రహదారులు రవాణా మంత్రిత్వ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పాల్గొన్నారు. గతంలో రహదారి నిర్మాణ విభాగంలో ఒక ఇండియా బుక్ ఆఫ్ రికార్డు మరియు ఒక గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు సాధించిన రాజ్ పథ్ ఇన్ఫ్రాకాన్ ప్రయివేట్ లిమిటెడ్ వారు మరో మారు అదే విభాగంలో నాలుగు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులను సాధించి మరో మారు చరిత్ర సృష్టించారు. ఈ క్రమంలో గతంలో తాము సాధించిన గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డును తామే బద్దలు కొట్టడం విశేషం. క్రింద పేర్కొన్న నాలుగు అంశాలలో రాజ్ ఫథ్ ఇన్ఫ్రాటెక్ ప్రయివేట్ లిమిటెడ్ వారు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలలో నాలుగు గిన్నిస్ రికార్డులను సాధించారు.లి 24 గంటల్లో 28.89 లేన్ కిలోమీటర్ల మేర నిరంతరాయంగా బిటుమినస్ కాంక్రీట్ వేయడంలో రికార్డు.లి 24 గంటల్లో అత్యధికంగా 10,655 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీట్‌ను నిరంతరాయంగా వేయడంలో రికార్డు.లి 57,500 మెట్రిక్ టన్నుల బిటుమినస్ కాంక్రీట్‌ను నిరంతరాయంగా వేయడంలో రికార్డు.156 సింగిల్ లేన్ కిలోమీటర్ల మేర నిరంతరాయంగా రహదారి నిర్మాణం చేయడంలో రికార్డు. కార్యక్రమంలో ఎంపీ బి.కె. పార్థసారథి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ... నాలుగు గిన్నిస్ రికార్డులకు శ్రీ సత్యసాయి జిల్లా వేదిక కావడం జిల్లా వాసులందరికీ గర్వకారణం అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని, సత్య సాయి జిల్లా మరింత అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ ఇంజనీర్లు మరియు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కులాలు, మతాలకు అతీతంగా “సంక్రాంతి“ వేడుకలు

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,
- సంక్రాంతి సంబరాల్లో పాల్గొని, పోలీసు ఉద్యోగులు, సిబ్బంది, కుటుంబ సభ్యులకు భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,






**అంకుశం న్యూస్ విజయనగరం జనవరి 12:** విజయనగరం పట్టణం 2వ పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను పోలీసు స్టేషను ప్రాంగణం లో జనవరి 12న ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ముఖ్య అతిథిగా హాజరై, వేడుకలను ప్రారంభించి, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులతో కొంత సమయాన్ని గడిపి, వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - సంక్రాంతి పండగను సహృద్భవ వాతావరణంలో నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వాస్తవానికి సంక్రాంతి పండగ అన్నది ఒక మతానికి, కులానికి చెందిన పండగ కాదన్నారు. వ్యవసాయదారులు కష్టించి పండించిన పంట చేతికి రావడం, సిరి సంపదలు, ఆదాయం చేతికి అందడంతో, కుటుంబ సభ్యులతో తమ ఆనందాన్ని పంచుకుంటూ, జరుపుకొనే వేడుకని అన్నారు. కావున, ఈ పండగను మతాలు, కులాలకు అతీతంగా నిర్వహించుకోవాలన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే సంక్రాంతి వేడుకను 2వ పట్టణ పోలీసు స్టేషను ప్రాంగణంలో నిర్వహించుకోవడం, వేడుకల్లో పోలీసు అధికారులు, సిబ్బంది అన్న తారతమ్యం లేకుండా నిర్వహించుకోవడం, పోలీసు కుటుంబాలు కూడా భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు పోలీసులు ఎప్పుడూ చేరువగా ఉండాలని, పోలీసు స్టేషనుకు వచ్చే బాధితులకు చట్ట పరిధిలో సహాయపడాలన్నారు. పోలీసు స్టేషనుకు వచ్చే బడుగు, బలహీన వర్గాలు, పేదలు, వృద్ధులు, మహిళలు, పిల్లలకు అందుబాటులో ఉంటూ, పోలీసు సేవలను అందించాలన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపట్ల, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. పండగ పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించ వద్దని, వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా ఎల్లప్పుడు ఖాకీ యూనిఫారం ధరించే పోలీసు అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలసి తెలుగుదనం ఉట్టిపడేలా సంప్రదాయ దుస్తులు ధరించి, వేడుకల్లో పాల్గొని, ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గొబ్బెమ్మలు, రంగురంగుల ముగ్గులు, భోగి మంటలు ఆకట్టుకున్నాయి. ఈ సంక్రాంతి సంబరాల్లో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఆర్.గోవిందరావు, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు, ఎస్ఐలు కృష్ణమూర్తి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# భూ సమస్యలు పరిష్కరించండి

- ధర్మవరం ఆర్డీఓని కలిసి విజ్ఞప్తి చేసిన ఎమ్మెల్యే పరిటాల సునీత
- ఆ రోజు జగన్ బొమ్మలపై ఐఏఎస్ లు ఎందుకు అభ్యంతరం చెప్పలేదో..?





**అంకుశం న్యూస్ అనంతపురం జనవరి 12:** రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో ఉన్న భూసమస్యలకు వేగంగా పరిష్కారం చూపించాలని ధర్మవరం ఆర్డీఓకు ఎమ్మెల్యే పరిటాల సునీత విజ్ఞప్తి చేశారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారంపై ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించే రెవెన్యూ క్లినిక్ కార్యక్రమానికి ఆమె వెళ్లారు. ఆర్డీఓ మహేష్ ను కలిసి ప్రస్తుతం పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ నేపథ్యంలో రైతుల నుంచి వస్తున్న విజ్ఞప్తులను వివరించారు. భూ వ్యత్యాసాలు, భూ వర్గీకరణ, విస్తీర్ణంలో మార్పులు, చేర్పులు సర్వే నంబరు తప్పిదాలు, జాయింట్ ఎల్పీఎంలు, మిగులు భూములువంటి వాటి గురించి వివరించారు. ఈ సమస్యల పరిష్కారంపై తహసీల్దార్లు, వీఆర్ఓలు ఇతర సిబ్బంది వేగంగా పని చేసేలా చూడాలని కోరారు. రైతులకు వీటిపై అవగాహన కల్పిస్తూ.. సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. దీనిపై ఆర్డీఓ కూడా సానుకూలంగా స్పందించారు. కొన్నింటికి అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ఆర్డీఓ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ భూఆధారిత సమస్యల పరిష్కారంపై ఈ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందన్నారు. అసైన్మెంట్ కమిటీ ఏర్పాటు చేయాలని ఇప్పటికే రెవెన్యూ మంత్రికి విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. గత ప్రభుత్వంలో రీసర్వే పేరుతో భూముల రికార్డులను అస్తవ్యస్తం చేశారన్నారు. పైగా తన సొమ్ము ఏదో ఇచ్చినట్టు పాసుబుక్కుల్లో జగన్ రెడ్డి తన ఫోటో వేసుకున్నారని విమర్శలు చేశారు. ఆ రోజు ఐఏఎస్ లు ఎందుకు దీనికి అడ్డు చెప్పలేదో అర్థం కావడం లేదన్నారు. మా ప్రభుత్వం వచ్చాక సమస్యల్ని పరిష్కరిస్తూ రాజముద్రతో పాసుపుస్తకాలు ఇస్తున్నామన్నారు. గతంలో జరిగిన తప్పుల్ని సరి చేస్తున్నామని.. ఇది రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాయింట్ గా ఉన్న భూముల విషయంలో రైతులు ఒక నిర్ణయానికి రావాలని.. వీటిపై పంతంతో ఉంటే మీ పేరుతో ఎక్కువ భూములు చూపిస్తాయన్నారు. దాని వలన మీకు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందకపోవచ్చని అన్నారు. పరస్పరం అంగీకారంతో మీరు అధికారుల వద్దకు వెళ్తే.. మీరు మీకున్న పొలం ప్రకారం పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకునే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే సునీత తెలిపారు..

## వికలాంగులకు భారత్ వికాస్ పరిషత్ ఒక వరం

- జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కృత్రిమ అవయవాల పంపిణీ





**అంకుశం న్యూస్ అనంతపురం జనవరి 12:** వికలాంగులకు భారత్ వికాస్ పరిషత్ సంస్థ ఒక వరం లాంటిదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. స్వామి వివేకానంద 163వ జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జడ్పీ ఎదురుగా ఉన్న శ్రీ సాయి ఫంక్షన్ హాల్లో వికలాంగులకు కృత్రిమ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి, మార్కెట్ యార్డ్ ఛైర్ పర్సన్ బల్లా పల్లవి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ గుడిపూటి నారాయణస్వామి, భారత వికాస్ పరిషత్ ప్రతినిధులు రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అర్బన్ నియోజకవర్గంలో పలు వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందజేశారు. ఎమ్మెల్యే వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, పోలియో, షుగర్ కారణంగా దివ్యాంగులు అయిన వారు చాలా ఇబ్బందులు పడుతుంటారన్నారు. ఇలాంటి వారికి తిరిగి కొత్త జీవితం ఇచ్చేందుకు భారత్ వికాస్ పరిషత్ ఎంతోగానే కృషి చేస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వారు కేంద్రాలు నడుపుతూ కృత్రిమ అవయవాలు, ట్రైసైకిళ్ళు, వినికిడి యంత్రాలు వంటివి ఉచితంగా పంపిణీ చేస్తూ సేవ చేస్తోందన్నారు. వేలాది మందికి సహాయం చేస్తూ.. భారతదేశంలో వికలాంగులకు సేవ చేసే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థలలో ఒకటిగా నిలుస్తోందన్నారు. ఈ సంస్థ అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో వికలాంగులకు అండగా నిలబడినందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సరిపూటి సూర్యనారాయణ, నాగన్న, భారత వికాస్ పరిషత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ..

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం ఉపయోగిస్తున్న 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియలో లోపాలు చోటు చేసుకున్నాయని ఆమె ఆరోపించారు. దీనివల్ల నిజమైన ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆమె అన్నారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు ఆమె లేఖ రాశారు. ఎస్ఐఆర్ ప్రారంభమైనప్పటి నుంచి ఆమె ఈసీకీ లేఖ రాయడం ఇది ఐదోసారి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా 2002 నాటి ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ చేపట్టారని, అయితే ఈ ప్రక్రియ సందర్భంగా ఓటర్ల వివరాల్లో తీవ్ర తప్పిదాలు చోటు చేసుకుంటున్నాయని ఆమె పేర్కొన్నారు. ఇది పెద్ద ఎత్తున డేటా మిస్ మ్యాచ్‌కు దారి తీసిందని, దీనివల్ల నిజమైన ఓటర్లు ఈ సమస్య బారిన పడుతున్నారని అన్నారు. ఓటర్ల జాబితా సవరణలకు సంబంధించి గత రెండు దశాబ్దాలుగా అనుసరించిన విధానాలను ఈసీ ఇప్పుడు పక్కన పెట్టిందని ఆమె ఆరోపించారు. దీనితో ఓటర్లు తమ గుర్తింపును మళ్లీ నిరూపించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీ ఎప్పటినుంచో వస్తున్న తన సొంత పద్ధతులను విస్మరించడాన్ని ఆమె ఖండించారు. ఇది ఏకపక్షంగా, అహేతుకంగా, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని అన్నారు. ఎస్ఐఆర్ సమయంలో సమర్పించిన పత్రాలకు సరైన రసీదు ఇవ్వడం లేదని విమర్శించారు. ఈ ప్రక్రియలోనే లోపం ఉందని ఆమె పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ చాలా వరకు యాంత్రికంగా, సాంకేతిక డేటా ఆధారంగానే కొనసాగుతోందని, సున్నితత్వం, మానవీయతను పట్టించుకోవడం లేదని ఆమె అన్నారు.

## మిత్రుల మధ్య విభేదాలు సహజమే..

తమ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధ్య స్నేహబంధం నిజమైందేనని భారత్‌కు నూతన అమెరికా రాయబారిగా బాధ్యతలు చేపట్టిన సెర్గియో గోర్ పేర్కొన్నారు. నిజమైన స్నేహితుల మధ్య విభేదాలు సహజమని, ట్రంప్, మోదీల మధ్య విభేదాలు కూడా అలాంటివేనని అన్నారు. వాటిని పరిష్కరించుకుని ముందుకు సాగడానికి వారు ప్రయత్నిస్తారని తెలిపారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక, వాణిజ్య సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ప్రపంచంలోనే భారతదేశం అతిపెద్ద దేశమని, రెండు దేశాల మధ్య సత్సంబంధాలకు వాణిజ్యం చాలా కీలకమని గోర్ అభిప్రాయపడ్డారు. వీలైనంత త్వరగా వాణిజ్యం ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరు దేశాల ప్రతినిధులు నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని ఆయన తెలిపారు. భద్రత, సాంకేతికత, ఆరోగ్యం, ఇంధనం వంటి రంగాల్లో కూడా రెండు దేశాల మధ్య పరస్పర సహకారం కొనసాగుతుందని అన్నారు. భారతదేశమే తమకు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. వాణిజ్య ఒప్పందానికి సంబంధించి జనవరి 13న ఇరు దేశాల ప్రతినిధులు మరోసారి సమావేశం కానున్నట్లు సెర్గియో గోర్ వెల్లడించారు.

## రిస్క్ తీసుకుంటేనే ఉన్నత స్థానం

స్వామి వివేకానంద జీవితం ఎంతో మందికి ఆదర్శ ప్రాయమని ప్రధాని మోదీ అన్నారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ 2026 ముగింపు కార్యక్రమానికి మోదీ హాజరయ్యారు. యువత రిస్క్ తీసుకోవడానికి ఏమాత్రం వెనకాడకూడదని మీ విజయం దేశాన్ని కొత్త శిఖరాలకు చేరుస్తుందని తెలిపారు. 2047 వికసిత్ భారత్ ప్రయాణం దేశ అభివృద్ధికి ఎంతో కీలకమన్నారు. 2014లో తాను ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే వారిలో అక్కడున్న వారిలో చాలామంది చిన్నపిల్లలని అక్కడి యువతనుద్దేశించి మోదీ మాట్లాడారు. ప్రస్తుతం స్కిల్ డెవలప్‌మెంట్ సెక్టార్‌లో అనేక మార్పులు తెచ్చామని ఐఐటీలను కూడా అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. యవత చాలా యాక్టివ్‌గా ఉండాలని ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ప్రధాని మోదీ యువతకు సూచించారు. నేడు స్వామివివేకానంద జయంతి ఈ రోజును భారత్ జాతీయ యువజన దినంగా జరపుకుంటుంది.

## అత్యాధునిక టెక్నాలజీతో అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ), రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సంస్థ కలిసి బెంగళూరు- కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ (బీఎ-544+)లో అసాధారణ వేగంతో రహదారి నిర్మాణం చేసి నాలుగు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించడం తెలిసిందే. కేవలం ఆరు రోజుల్లోనే 156 లేన్ కిలోమీటర్లు (అంటే 52 కిలోమీటర్ల స్ట్రెచ్‌లో 3-లేన్ వెడల్పు) నిరంతరంగా పేవింగ్ చేశారు. అందులో ఒక రోజు, జనవరి 6న 24 గంటల్లోనే 28.8 కిలోమీటర్లు పూర్తి చేశారు అదే సమయంలో 10,675 మెట్రిక్ టన్నుల బిటుమిన్ కాంక్రీట్ వేయడం కూడా ఒక ప్రపంచ రికార్డు. 57,500 మెట్రిక్ టన్నుల బిటుమిన్ నిరంతరంగా వేయడం, మరియు మొత్తం 156 లేన్ కి.మీ. పేవింగ్‌తో పాత రికార్డులను మించిపోయారు. ఇవన్నీ ఆధునిక మెషినరీ, భారీ టీమ్ వర్క్‌తో, నాణ్యతలో ఏమాత్రం రాజీ లేకుండా సాధించారు. ఇది ఆరు లేన్ హైవేల్లో జరిగిన అద్భుతం. ఈ పనితీరుపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసలు కురిపించారు. మన ఇంజినీర్లు, అధికారులు అసాధ్యాన్ని సాధ్యం చేశారని, నూతన సాంకేతికతతో త్వరగా, నాణ్యమైన రోడ్లు నిర్మించడం గొప్ప విషయమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ పనులపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ నాలుగు గిన్నిస్ రికార్డులు దేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని, నితిన్ గడ్కరీ నాయకత్వంలో ప్రపంచ స్థాయిలో సాధించామని ప్రత్యేకంగా రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్‌ను అభినందించారు. ఈ రోడ్ పూర్తయితే బెంగళూరు-విజయవాడ మధ్య దూరం 100 కిలోమీటర్లు తగ్గి, ప్రయాణ సమయం 12 గంటల నుంచి 8 గంటలకు తగ్గుతుంది. రాయలసీమ, తీర ప్రాంతాలు బాగా కనెక్ట్